పెన్ పవర్
తెలంగాణ రౌండప్
శనివారం 19 జూలై 2025 పేజీలు 8

# కేంద్రం చొరవతోనే జల వివాదాలపై కమిటీ

- తెలంగాణ హక్కుల విషయంలో భాజపా వెనకడుగు వేయదు
- తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలనూ పరిగణనలోకి తీసుకుంటుంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భరోసా



హైదరాబాద్ పెన్ పవర్: కేంద్రం చొరవ తీసుకోవడం వల్లే ఏపీ తలపెట్టిన బనకచర్లతో పాటు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాల పరిష్కారానికి నిపుణులతో ఒక కమిటీ వేసుకొనే విషయమై ఏకాభిప్రాయం వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ హక్కుల విషయంలో భాజపా ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేయదని, అదే సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు. "కేంద్రం నిర్వహించిన సమావేశంపై భారత రాష్ట్ర సమితి నాయకులు అనేక రకాల విమర్శలు చేస్తున్నారు. సమావేశం ఎలా పెడతారని అంటున్నారు. బనకచర్లపై ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం లేఖ రాయడం వల్లే కేంద్రం చొరవ చూపింది. నేను స్వయంగా వెళ్లి ప్రధానిని, జలశక్తి మంత్రిని కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరా. ఈ క్రమంలో ఇద్దరు సీఎంలను కేంద్రం ఆహ్వానించి సమావేశం ఏర్పాటు చేసింది. జల వివాదా లను

-2 లో

# హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షం..

- పొంగిపొర్లిన వాగులు.. నాలాలు
- రాజధానిలో స్తంభించిన ట్రాఫిక్
- అత్యధికంగా సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో 12.9 సెం.మీ.
- సికింద్రాబాద్ పికెట్‌లో 11.5 సెం.మీ.
- గోడ కూలి మహిళ దుర్మరణం



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రవ్యాప్తంగా వానలు దంచికొట్టాయి. ప్రధానంగా మధ్య తెలంగాణ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. ప్రధానంగా హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలో ఈ ఏడాదిలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో 12.9 సెంటీమీటర్లు కురిసింది. సికింద్రాబాద్ పరిధి మారేడుపల్లిలోని పికెట్ ప్రాంతంలో 11.5 సెం.మీ నమోదైంది. ఇంకా మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, జనగామ, పెద్దపల్లి, మెదక్, యాదాద్రి, సిద్దిపేట, నిర్మల్ తదితర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వాగులు, వంకలు, నాలాలు ఉప్పొంగాయి.

-2 లో

# ఒవైసీ కళాశాలపై పదేపదే ప్రశ్నిస్తున్నారు

- హైడ్రాకు ఏ కళాశాల అయినా ఒక్కటేనన్న రంగనాథ్
- హైడ్రాపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆవేదన
- సల్కం చెరువుకు తుది నోటిఫికేషన్ ఇంకా ఇవ్వలేదన్న రంగనాథ్



హైదరాబాద్ పెన్ పవర్:ఒవైసీ కళాశాలల విషయంలో పదేపదే తమను ప్రశ్నిస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏ కళాశాల అయినా ఒకటేనని ఆయన స్పష్టం చేశారు.

-2 లో

## 3.0 లోడింగ్... 2028లో రప్పా రప్పా

# వడ్డీతో సహా చెల్లిస్తాం



- ఖమ్మం జిల్లాలో పర్యటించిన కేటీఆర్
- కార్యకర్తల సమావేశంలో కనిపించిన ఫ్లెక్సీ
- తలపాగా కట్టిన కేటీఆర్ ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు
- కాంగ్రెస్ నాయకులకు వడ్డీతో సహా చెల్లిస్తామని వ్యాఖ్య

## ఖమ్మంలో కేటీఆర్ ఫ్లెక్సీ

హైదరాబాద్ పెన్ పవర్:ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధించిన ఒక ఫ్లెక్సీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "లోడింగ్ 3.0" అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు కేటీఆర్ ఫొటోతో ఆ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. "3.0 లోడింగ్.. 2028లో రప్పా రప్పా.. కాంగ్రెస్ నాయకులకు వడ్డీతో సహా చెల్లిస్తాం" అనే నినాదంతో తలపాగా కట్టిన కేటీఆర్ ఫొటోను ఆ ఫ్లెక్సీలో ముద్రించారు. పలువురు కార్యకర్తలు

-2 లో

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



హైదరాబాద్ పెన్ పవర్: గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో రాజీ పడవద్దని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ఆ మేరకు ఇప్పటికే మెస్‌ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి సైదులు, 327 మంది గురుకుల ప్రిన్సిపళ్లతో వీడియో కాన్ఫరెన్సులో మంత్రి మాట్లాడారు. 'రీజినల్ కో ఆర్డినేటర్లు నిరంతరం గురుకులాల్ని తనిఖీ చేయాలి. ఉపాధ్యాయులు పిల్లలను పర్యవేక్షించాలి. ఏదైనా సంఘటన జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలి. పాఠశాలల్లో పరిశుభ్రత పాటించడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించాలి' అని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

-2 లో

# హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షం..

- మొదటి పేజి తరువాయి

ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కురిసిన వర్షానికి జనం విలవిల్లాడారు. సాయంత్రం కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరిన వారు రోడ్లపైనే నిలిచిపోయారు. పాఠశాలల వాహనాలు రోడ్లపైకి రావడంతో కూకట్‌పల్లి నుంచి ఎంజీబీఎస్ ప్రధాన రహదారి, ఉప్పల్ నుంచి బేగంపేట, రామంతాపూర్ నుంచి చాదర్‌ఘాట్, ఎల్బీనగర్ మార్గాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. మరోవైపు ప్రధాన రహదారులు వాగుల్లా మారాయి. పెద్దఎత్తున జనం మెట్రో రైల్లో ప్రయాణించారు. నాలాలు పొంగిపొర్లడంతో లోతట్టు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. హైడ్రా సిబ్బంది బాధితులను పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆదిభట్ల ఠాణా పరిధిలోని నాదర్‌గుల్‌లో గోడ కూలి నల్గొండ జిల్లా నాయకులతండాకు చెందిన లక్ష్మి(35) మృతిచెందారు. గచ్చిబౌలి నుంచి బయోడైవర్సిటీ చౌరస్తాకు వెళ్లే మార్గంలో ప్రిన్స్‌టన్ మాల్ వద్ద వరద

### నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం నుంచి మంగళవారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఈదురు గాలులు కూడా వీస్తాయని పేర్కొంది. దక్షిణ కోస్తా.., దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

19, 20 తేదీలు: సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్.

20, 21 తేదీలు: పై జిల్లాలతో పాటు ములుగు, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, వనపర్తి, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, జయశంకర్ జిల్లాల్లో వానలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది.

### వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అధికారులకు సీఎం ఆదేశాలు

హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీసు, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కేంద్రం చొరవతోనే జల వివాదాలపై కమిటీ

- మొదటి పేజి తరువాయి

పరిష్కరించుకునేందుకు ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు, అధికారులతో ఒక కమిటీని వేసుకోవాలనే విషయమై సమావేశంలో ఏకాభిప్రాయం వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ రకంగా సహకారం అందించింది తప్పితే తెలంగాణకో, ఆంధ్రాకో అనుకూలంగా తీర్పునివ్వడానికి సీఎంలను పిలవలేదు.

### అబద్ధాలు మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి ఉదయం లేస్తే కిషన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ఏం చేశారు.. మోదీ ఏం ఇచ్చారు... కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను రక్షిస్తున్నారు.. అంటూ అబద్ధాలు మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వద్ద గోదావరి జలాల వినియోగంపై కార్యాచరణ ప్రణాళిక ఉందా? యూరియా కొరత అన్ని దేశాల్లో ఉంది. మనకు కేంద్రం సరిపడా సరఫరా చేస్తోంది. కొరత లేకుండా చూసే బాధ్యత కేంద్రానిది. రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలతో బీసీలను మోసం చేస్తోంది. బీసీ రిజర్వేషన్లు పూర్తిగా వారికే ఇవ్వాలి. అందులో ముస్లింలకు చోటు కల్పిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుంది. బీసీ సంఘాల నేతలు ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వం కాజీపేటలో నిర్మిస్తున్న రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో వచ్చే సంవత్సరం ఉత్పత్తి ప్రారంభమవుతుంది. దశలవారీగా రైలు ఇంజిన్లు, రైలు కోచ్‌లు, వ్యాగన్ల ఉత్పత్తి అవుతాయి. ఈ పరిశ్రమకు రూ.521 కోట్లు మంజూరయ్యాయి. సమీక్షించేందుకు శనివారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కాజీపేటకు వెళుతున్నా. భారత రాష్ట్ర సమితి వాళ్లు ఇది రైళ్లను కడిగే పరిశ్రమ అని ఎగతాళి చేశారు. వరంగల్ విమానాశ్రయానికి భూసేకరణ చేసివ్వాలని నేను అప్పట్లో కేసీఆర్‌కు 20 ఉత్తరాలు రాశా... అయినా పట్టించుకోలేదు. ఎంఎంటీఎస్ రెండో దశ యాదగిరిగుట్ట వరకు వేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఎంవోయూ కుదిరింది. కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను జనవరిలో ప్రారంభిస్తాం. కేంద్రం రాష్ట్రానికి ఏం చేసిందని ప్రశ్నించే వారికి మోదీ అభివృద్ధి చేసిన 42 రైల్వే స్టేషన్లే సమాధానం చెబుతాయి" అని కిషన్‌రెడ్డి అన్నారు.

# ఒవైసీ కళాశాలపై పదేపదే ప్రశ్నిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

హైడ్రా తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బతుకమ్మకుంట వద్ద విద్యార్థులు, స్థానికులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ మానవహారం నిర్వహించారు. నీటి వనరుల పరిరక్షణపై హైడ్రా ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైడ్రాపై తప్పుడు ప్రచారం జరుగుతోందని అన్నారు. మూసీకి సంబంధం లేకున్నా హైడ్రాకు ముడిపెట్టారని ఆయన పేర్కొన్నారు. ఒవైసీ కాలేజీల విషయంలో తమ నిర్ణయాన్ని చాలా స్పష్టంగా చెప్పామని, హైడ్రా సామాజిక కోణంలోనే పని చేస్తుందని అన్నారు. ఒవైసీ కళాశాలలను 2015–16లో నిర్మించారని, కళాశాల ఉన్న చెరువు ప్రాంతానికి 2016లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు.సల్కం చెరువుకు తుది నోటిఫికేషన్ ఇంకా ఇవ్వలేదని, నగరంలో 80 శాతం చెరువులకు తుది నోటిఫికేషన్ ఇంకా జారీ కాలేదని ఆయన అన్నారు. 140 చెరువులకు మాత్రమే తుది నోటిఫికేషన్ జారీ చేశారని, 540 చెరువులకు పదేళ్ల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారని రంగనాథ్ వివరించారు. సల్కం చెరువు నోటిఫికేషన్ ప్రక్రియలో ఉన్న సమయంలో ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారని ఆరోపించారు. అనధికారిక నిర్మాణాలను తొలగిస్తామని చెప్పారు.ఒవైసీ కళాశాలపైనే ఎందుకు అంత ఆసక్తి అని ఆయన ప్రశ్నించారు. హైడ్రాకు ఏ వర్గం కళాశాల అయినా ఒకటే అని స్పష్టం చేశారు. పేదవాళ్ల మీద హైడ్రా పగబట్టిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. ఆక్రమణల వెనుక చాలామంది పెద్దలు ఉన్నారని, వాళ్లు తప్పించుకోవడానికి పేదలను ముందుకు తీసుకువస్తున్నారని చెప్పారు.ఆయన ఇంకా మాట్లాడుతూ, తమ ఆస్తులు ఆక్రమణదారులకు చిక్కకుండా ప్రజలు పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బతుకమ్మ సంబరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగా బతుకమ్మకుంటను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

# 3.0 లోడింగ్... 2028లో రప్పా రప్పా వడ్డీతో సహా చెల్లిస్తాం

- మొదటి పేజి తరువాయి

ఆ ఫ్లెక్సీతో సమావేశంలో సందడి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

కేటీఆర్ ఈరోజు ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ వంద సీట్లలో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖతమవుతుందని జోస్యం చెప్పారు. రేవంత్ రెడ్డి లాంటి దుర్మార్గులు ఉంటారని అంబేద్కర్ కూడా ఊహించలేకపోయారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రతి ఒక్కరినీ, ప్రతి రంగాన్ని మోసం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

# రేవంత్ రెడ్డి దెబ్బకి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చున్నారు: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**మూడోసారి అధికారంలోకి వచ్చి కేసీఆర్ కుటుంబం దోచుకోవాలని కలలు కన్నదని ఆరోపణ**

**కేదార్ అనే వ్యక్తి దుబాయ్‌లో డ్రగ్స్ కారణంగా చనిపోయాడన్న చామల**

**కేటీఆర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ఆరోపించిన ఎంపీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దెబ్బకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి మరింత దోచుకోవచ్చని కలలు కన్న కేసీఆర్ కుటుంబానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు.

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేదార్ అనే వ్యక్తి దుబాయ్‌లో డ్రగ్స్ కారణంగా చనిపోయినట్లు తేలిందని అన్నారు. ఆయనకు కేటీఆర్‌కు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. దుబాయ్‌లో కేదార్‌తో పెట్టుబడులు పెట్టించింది ఎవరని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాట్లాడిన దాంట్లో తప్పేముందో చెప్పాలని నిలదీశారు.

బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు చర్చ లేకుండా అసెంబ్లీని నడిపారని, మంత్రులకే తెలియకుండా గతంలో జీవోలు చేశారని ఆరోపించారు. కేంద్ర జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించిందని, నీటి పంపకాలపై నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు రప్పించినట్లు ప్రెస్ నోట్ కూడా విడుదల చేసిందని తెలిపారు. కానీ దానిని పక్కన పెట్టి బనకచర్ల గురించి మాట్లాడారని బీఆర్ఎస్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

# మరో మూడు రోజులు భారీ వర్షాలు.. రెండు రాష్ట్రాలకు అలెర్ట్



హైదరాబాద్ పెన్ పవర్:ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాలను వేగంగా కదులుతుండటంతో పాటు పశ్చిమగాలులు బలంగా వీస్తుండటం, ద్రోణి ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశముందని, రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడతాయాని వాతావరణ శాఖ తెలిపింది.

**తెలంగాణలో ఎల్లో అలెర్ట్...**

తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. బలమైన ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరరుపులోకూడిన గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా తెలిపింది. ఈర్జో తెలంగాణలోని నాగర్ కర్నూల్, భువనగిరి, హన్మకొండ,వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట్, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల్లో భారీ వర్షాలు నమోదవుతాయని తెలిపింది. ఆదివారం వరకూ ఈ భారీ వర్షాలు తప్పవని చెప్పింది. కొన్నిజిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే జిల్లాలకు ఈ అలెర్ట్ జారీ చేసింది.


**ఏపీలో ఈ ప్రాంతంలో...**

ఆంధ్రప్రదేశ్ లోనూ మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని విశాఖవాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొంది. దక్షిణ కోస్తా ప్రాంతంలో తేలికపాటి నుంచిమోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులుపడతాయని చెప్పింది. ఉత్తర కోస్తా ప్రాంతంలో కొన్నిచోట్ల భారీవర్షాలు కురిసే అవకాశముందని కూడా వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక రాయలసీమలో ఈరోజు మోసర్తు వర్షాలు పడతాయని, అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంపడుతుందని కూడా విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## కంకికి వెయ్యి గింజలు.. ఎకరానికి పది టన్నులు

### వరిలో కొత్త చరిత్ర దిశగా..

### ప్రస్తుత రకాలతో పోల్చితే రెట్టింపు ఉత్పత్తి!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం రైతులు ఎకరం పొలంలో సాధారణ వరి వేస్తే కంకికి 150 నుంచి 200 గింజలు వస్తున్నాయి. మొత్తం 2 నుంచి 2.5 టన్నుల ధాన్యం వస్తోంది. గత ఏడాది అక్టోబరులో విడుదలైన డీఆర్ఆర్ ధాన్ 75, 76 రకాల్లో వరి కంకికి 450 నుంచి 500 గింజలు వస్తున్నాయి. 3.5 నుంచి 4.5 టన్నుల మేరకు ధాన్యం వస్తోంది. భారత వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్)లో దీనికి రెట్టింపు స్థాయిలో వరి కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి పది టన్నుల మేరకు భారీ ఉత్పత్తి సాధించే దిశగా కొత్త వంగడం సిద్ధమవుతోంది. ప్రాథమికంగా ప్రయోగాలు పూర్తికాగా.. తుది ఫలితాల అనంతరం మరో రెండేళ్లలో ఈ రకం అందుబాటులోకి రానుంది. హైబ్రిడ్‌లో కాకుండా సంప్రదాయ రకాల కలయిక ద్వారా ఈ సంస్థ శాస్త్రవేత్తలు కొత్త రకాన్ని సృష్టిస్తున్నారు. తక్కువ కాలంలో సాగయ్యే సన్న రకంగా.. తెగుళ్లను తట్టుకునేలా.. గ్లూకోజ్ శాతం తక్కువ ఉండేలా దీన్ని రూపొందిస్తున్నారు.

**చైనాను అధిగమించడమే లక్ష్యం**

కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి పది టన్నులు పండే వరి వంగడం 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలని సంకల్పించాం. దీనికి అనుగుణంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కొత్త వంగడం వరిలో చరిత్ర సృష్టిస్తుంది. ప్రస్తుతం చైనాలో హైబ్రిడ్ వరి.. ఎకరానికి 6 టన్నులు వస్తోంది. మేం రూపొందిస్తున్న రకం దాన్ని అధిగమిస్తుంది. రైతులకు ఉత్పాదకతను, దేశానికి ఆహారభద్రతను రెట్టింపు చేస్తుంది. కొత్తరకం విత్తనోత్పత్తికీ అనుకూలం.

## పళ్లెంలో బలమెంతో ఫోటో చెప్పేస్తుంది



హైదరాబాద్ పెన్ పవర్:ఆహారంలో పోషకాలుండాలని తెలుసు! కానీ మనం తింటున్న దాంట్లో ఎంతున్నాయో తెలిసేదెలా? పళ్లెంలో పెట్టుకున్న పదార్థాలను మీ ఫోన్‌తో ఒక్క ఫొటో తీయండి చాలు... అందులో ప్రొటీనెంతో, కార్బో ఎంతో, ఇతర పోషకాలెంతో చెప్పేస్తుంది జననీమిత్ర యాప్!

**మహిళలు.. గర్భిణులు రోజూ తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్‌లు ఎన్ని ఉన్నాయో ఎలా తెలుసుకోవాలి?**

అన్నం.. పప్పు.. కూర.. పెరుగు.. మాంసాహారం తింటే సరిపోతుందా? లేదా ఇతర పదార్థాలు తీసుకోవాలా? ఈ ప్రశ్నలకు ఓ యాప్ సమాధానం చెప్పేస్తుంది. చాలామంది మహిళలు రక్తహీనత కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీన్ని పరిష్కరించేందుకు ఏఐజీ ఆసుపత్రి... ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డిజిటల్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్‌కేర్ విభాగం సహకారంతో 'జననీ మిత్ర' యాప్ రూపొందించింది. కృత్రిమ మేధతో పనిచేసే ఈ యాప్ ప్రస్తుతం ప్రయోగదశలో ఉంది. రెండు, మూడునెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

**ప్లేటు ఏ ఆకారంలో ఉన్నా....**

ప్లేటు వృత్తాకారం, దీర్ఘచతురస్రం లేదా ఏ ఆకారంలో ఉన్నా అందులోని ఆహారపదార్థాలను గుర్తించేలా యాప్‌ను అభివృద్ధి చేశారు.

ఆహార పదార్థాలను ఫొటో తీయగానే, ప్లేట్‌లో అవి ఆక్రమించిన ప్రాంతాన్ని సెకన్ల వ్యవధిలో విశ్లేషించి వివరాలను తెలియజేస్తుంది.

ఇప్పటి వరకు వెయ్యికిపైగా ప్లేట్లలోని ఆహార పదార్థాలను యాప్ ద్వారా స్కాన్‌చేశారు. ఫలితాలను వైద్య, పోషకాహార నిపుణులతో విశ్లేషింపజేశారు.

ప్రతి ప్లేటులోని ఆహార పదార్థాల వివరాలను 95శాతం కచ్చితంగా చెప్పిందని నిపుణులు తేల్చారు. దీంతో వందశాతం ఫలితాలు వచ్చేంత వరకూ అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

**బహుళ ప్రయోజనాలు...**


జననీమిత్ర యాప్ ద్వారా మహిళలు, గర్భిణులకు ఆరోగ్య సంరక్షణతో పాటు బహుళ ప్రయోజనాలు కలగనున్నాయి. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం 30 శాతం మంది మహిళలు, గర్భిణులు రక్తహీనతను తగ్గించుకునేందుకు మందులు వినియోగిస్తున్నారు. ఈ యాప్ అందుబాటులోకి వస్తే వారికి ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెరగడంతో పాటు మందుల వినియోగం తక్కువయ్యే అవకాశాలున్నాయి.

## ఇంట్లో ఉంటే ఇంట్లోనే.. ఆఫీసులో ఉంటే ఆఫీసులోనే ఉండండి: దయచేసి బయటకు రావొద్దు ఇప్పుడల్లా !




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీ మొత్తం భారీ వర్షం పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. వీకెండ్.. అసలే శుక్రవారం సాయంత్రం.. రాబోయే రెండు రోజులు ఐటీ ఉద్యోగులకు హాలి డేస్.. చాలా మంది త్వరగా వెళ్లాలనే తాపత్రయంతో వర్షం పడుతున్నా.. రోడ్డెక్కి ఇంటికి వెళ్లాలని.. రోడ్డెక్కి ఊరెళ్లాలని.. పార్టీలకు వెళ్లాలని ప్లాన్ చేసుకుంటే మాత్రం.. వెంటనే ఆ ప్లాన్స్?ను వాయిదా వేసుకోండి.. ఎందుకంటే హైదరాబాద్ సిటీలో చాలా ప్రాంతాల్లో భారీ వర్షంతో రోడ్లపై నీళు నిలిచాయి.. ట్రాఫిక్ జాం అయ్యింది.. చాలా ప్రాంతాల్లో రోడ్లపై వాహనాలు బారులు తీరాయి.. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసులు ఇస్తున్న అలర్ట్ ఇలా ఉన్నాయి. హైదరాబాద్ సిటీలో రోడ్లు వాగులను తలపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, హైడ్రా టీంలు వరద నీళ్లు నిలిచిపోకుండా ఎంత శ్రమిస్తున్నా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో వరద నీళ్లు మోకాలి లోతు ప్రవహిస్తూనే ఉన్నాయి. ఈ ఏరియా.. ఆ ఏరియా అనే తేడా లేకుండా హైదరాబాద్ నగరంలోని ప్రధాన ఏరియాల్లో ట్రాఫిక్ తిప్పలతో వాహనదారులకు నరక యాతన పడుతున్నారు. ముఖ్యంగా.. సికింద్రాబాద్ వైపు ట్రాఫిక్ తిప్పలు దారుణంగా ఉన్నాయి. జేబీఎస్, కారా?నా, తిరుమల గిరి.. అల్వాల్ వైపు వెళుతున్న వాళ్లు మాత్రం ట్రాఫిక్?తో అల్లాడిపోతున్నారు. దాదాపు రెండు కిలోమీటర్లకు పైగానే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇక.. మాదాపూర్, హైటెక్ సిటీ, ఇనార్బిట్ మాల్ రూట్?లో కూడా ఫుల్ ట్రాఫిక్ జాం అయింది. మలక్ పేట్ యశోదా ఆసుపత్రి దగ్గర నుంచి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. లక్డీ కా పూల్ నుంచి మెహిదీపట్నం రూట్?లో అయితే ట్రాఫిక్ జాంతో వాహనదారులు చుక్కలు చూస్తున్న పరిస్థితి ఉంది.

## ఆదిలాబాద్ జిల్లాలో జిమ్‌లో డ్రగ్స్, స్టెరాయిడ్స్.. సీజ్ చేసిన పోలీసులు !



**హైదరాబాద్ పెన్ పవర్:**డ్రగ్స్ మహమ్మారి నగరాల నుంచి జిల్లాలకు పాకింది. జిమ్ కల్చర్ లో భాగంగా యువతకు డ్రగ్స్ ను పరిచయం చేస్తున్నారు దుండగులు. బాడీ బిల్డింగ్ కోసం ప్రయత్నించే యూత్ కు లేని పోని ఆశలు కల్పించి డ్రగ్స్ కు బానిసల్ని చేస్తున్నారు. ఇవి వాడితే మంచి బాడీ వస్తుందని.. కండలు తిరిగిన దేహం కావాలంటే ఇవి వాడాలని చెప్పి అలవాటు చేస్తున్నారు. శుక్రవారం (జులై 18) ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో డ్రగ్స్ దందా గుట్టు రట్టు చేశారు అధికారులు. లయన్ జిమ్ లో డ్రగ్ అమ్మకాలు జరుగుతున్నాయని తెలుసుకున్న పోలీసులు.. మధ్యాహ్నం తర్వాత సోదాలు నిర్వహించారు. పోలీసుల సోదాల్లో భారీగా డ్రగ్స్ స్టెరాయిడ్స్ బయటపడ్డాయి. అక్రమంగా తెప్పించిన డ్రగ్స్, స్టెరాయిడ్స్, విటమిన్ ట్యాబ్లెట్స్ పేరున అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ దందా నడిపిస్తున్న జిమ్ ను పోలీసులు సీజ్ చేశారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారో.. దీని వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది.

# హైదరాబాద్ సిటీలో కుండపోత వాన.. పంజాగుట్ట వైపు వెళ్తుంటే మాత్రం ఇది మస్ట్‌గా తెలుసుకోండి !



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలో శుక్రవారం సాయంత్రం 3 గంటల సమయం నుంచి ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లు పడిందేమో అనేంతలా కురిసిన కుండపోత వర్షానికి రోడ్లు వాగులను తలపించాయి. సిటీలోని ప్రధాన ఏరియాలైన పంజాగుట్ట, అమీర్ పేట్, ఎస్. ఆర్ నగర్, బోరబండ, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. యూసఫ్ గూడ, కృష్ణానగర్ ప్రాంతాల్లోని బస్తీల్లో రోడ్లపై మోకాలి లోతు నీళు కనిపించాయి. భారీ వర్షం కారణంగా పంజాగుట్ట మెట్రో స్టేషన్, పంజాగుట్ట సర్కిల్ ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరింది. హైదరాబాద్ సిటీలోనే ప్రధాన కూడలి కావడం తో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. నీళ్లు నిలిచే అవకాశం ఉన్న ఏరియాల్లో వరద నీళ్లు నిలవకుండా ఎప్పటికప్పుడు వాటర్ బోర్డ్, జీహెచ్ఎంసీ, హైడ్రా, మాన్ సూన్ ఎమర్జెన్సీ బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. భారీ వర్షానికి సంబంధించి హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వ యంత్రాంగం అలర్ట్ అయింది. వర్షాల నేపథ్యంలో ఇంపాక్ట్ ఫోర్ క్యాస్ట్ ను వాతావరణ శాఖ విడుదల చేసింది. మరో మూడు గంటల పాటు హైదరాబాద్ సిటీకి వర్ష సూచన చేసింది. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు హైదరాబాద్ సిటీలో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలతో పాటు అక్కడక్కడ జోరు వర్షానికి ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ సూచించింది. హైదరాబాద్ సిటీతో పాటు సిటీ శివారు ప్రాంతాలకు మరో మూడు గంటల పాటు ఆరెంజ్ అలర్ట్ కొనసాగనుంది. ఉరుములు మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలు వీచే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించిది.

# ఇక నుంచి మీ వెహికిల్‌ను ఆపరు.. ఆటోమేటిక్‌గా ఫైన్ పడిపోతుంది.. రాష్ట్రవ్యాప్తంగా AI కెమెరాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**రూల్స్ పాటించకుండా.. ఫైన్ కట్టకుండా తప్పించుకు తిరిగే వాహనదారులకు ఇక నుంచి బ్యాడ్ న్యూస్. వాహనాలను ఆపకుండానే ఫైన్ వేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ కెమెరాలను (ఏఎన్ పీఆర్) ఏర్పాటు చేస్తున్నారు. ఈ కొత్త టెక్నాలజీతో నిబంధనల ఉల్లంఘంచే వాహనాల్ని వెంటనే పట్టుకునేందుకు రవాణాశాఖ సిద్ధం అవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే కెమెరాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం రూ.3.30 కోట్ల ఖర్చుతో 30 ప్రాంతాల్లో 60 ఏఎన్‌పీఆర్ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం పరిపాలనపరమైన అనుమతుల్ని జారీ చేస్తూ రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిధుల విడుదలకు అన్ని రకాల అనుమతులు రానున్నాయి. వెహికిల్ టాక్స్ కట్టకపోవడం, ఓవర్ లోడింగ్ వంటి నిబంధనలను ఉల్లంఘించే వాహనాల్ని పట్టుకునేందుకు ఈ కెమెరాలు దోహదం చేస్తాయి. ఏఐ సాయంతో వహికిల్ నంబర్ ను ఆటోమేటిక్ గా గుర్తిస్తాయి కెమెరాలు. వెహికిల్ డీటైల్స్ అన్ని అధికారులకు పంపిస్తాయి. దీంతో వేగంగా పట్టుకోవడానికి వీలవుతుంది. ఇటీవల కామారెడ్డి చెక్‌పోస్టు వద్ద జూన్ నెలలో ప్రయోగాత్మకంగా కెమెరాలు ఏర్పాటు చేయగా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమమేధ) ద్వారా వాహనాల సమాచారం క్షణాల్లో తెలిసిపోయిందని అధికారులు తెలిపారు. ఇదే టెక్నాలజీతో పనిచేసే కెమెరాలు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కెమెరాలకు దూరంగా ఉండి అధికారులు కెమెరా పంపే సమాచారంతో.. వెహికిల్ ను ముందుగానే గుర్తించి దూరంగా ఆపుతున్నారు. నిబంధనలను పాటించని వెహికిల్స్ ను కెమెరా సహాయంతో అడ్డుకుని జరిమానాలు విధిస్తున్నారు. ఇలా చేయడం వలన రోడ్లపై కనిపించే ప్రతి వాహనాన్ని ఆపాల్సిన అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు.

# హైదరాబాద్‌లో సెల్ టవర్లకు దగ్గర్లో ఉన్నోళ్లు జాగ్రత్త.. .. అలా చేస్తే సేఫ్ అంటున్న హైడ్రా !

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో ఉన్నట్లుండి వాతావరణం ఒక్కసారిగా మారింది. వర్షాకాలం ఆరంభానికి ముందే వచ్చిన వానలు.. మధ్యలో మొహం చాటేశాయి. మళ్లీ ఎండాకాలాన్ని తలపించిన వాతావరణం.. గత రెండు మూడు రోజులుగా చల్లబడుతూ వచ్చింది. శుక్రవారం (జులై 18) ఉన్నట్లుండి వెదర్ పూర్తిగా మారిపోయింది. మధ్యాహ్నం తర్వాత నగర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వానలు మరో మూడు నాలుగు రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం (%×వీణ%) హెచ్చరించింది. భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో హైదరాబాద్ ప్రజలను మెసేజ్ ల ద్వారా అలర్ట్ చేసింది హైడ్రా టీం. వర్షాలు కురుస్తున్న కారణంగా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా మొబైల్ టవర్ సిగ్నల్ కింద ఉన్న ప్రజలందరికీ హైడ్రా రెయిన్ అలెర్ట్ మెసేజ్ పంపించింది. టవర్స్ కు సమీపంలో ఉన్న ప్రజలకు వ్యక్తిగత మెస్సేజ్ లు పంపించింది.




మరో రెండు గంటల పాటు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అలర్ట్ గా ఉండాలని మెసేజ్ లు పంపింది హైడ్రా. వెస్ట్, సౌగ్, సెంట్రల్, ఈస్ట్ హైదరాబాద్ ప్రజలు అలర్ట్ గా ఉండాలని.. భారీగా ఉరుములు మెరుపుల కారణంగా పిడుగులు పడే అవకాశం ఉందని.. జాగ్రత్తగా ఉండాలని మెసేజ్ లు పంపింది. హైదరాబాద్ వ్యాప్తంగా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని సూచించింది. ఉరుములు, మెరుపులు తీవ్ర స్థాయిలో ఉంటున్నందున సెల్ ఫోన్లు పక్కన పెట్టాలని సూచించింది. భారీ ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో నెట్ ఆఫ్ చేసి పెట్టుకోవాల్సింది హైడ్రా సూచించింది. అదే విధంగా మెరుపుల కారణంగా పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆ సమయంలో ఫోన్ మాట్లాడకుండా ఉంటే మంచిదని సూచించారు అధికారులు. నెట్ ఆన్ చేయడం, కాల్స్ మాట్లాడటం వలన షాక్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని.. వర్షం నిలిచే వరకు అత్యవసరం అయితే తప్ప ఫోన్లు మాట్లాడక పోవడం బెటర్ అని తెలిపింది.

వర్షం కురుస్తున్న సందర్భంలో బాల్కనీలో ఉంటూ ఫోన్ మాట్లాడటం మరింత ప్రమాదమని తెలిపింది హైడ్రా. మరొక రెండు గంటల పాటు హైదరాబాదు ఓఆర్ఆర్ పరిధిలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారి చేసింది. వీలైనంత వరకు ఇళ్లల్లోనే ఉండాలని.. బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించింది. అదే విధంగా వర్షం కారణంగా ట్రాఫిక్ జాం ఏర్పడుతుందని.. వెళ్లే దారిలో ట్రాఫిక్ ఉందేమో చెక్ చేసుకోవాలని హైడ్రా సూచించింది. జీహెచ్ఎంసీ నుంచి ఓఆర్ఆర్ వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ (%ాణహీూ%) సూచనలు తప్పక పాటించాల్సిందిగా సూచించింది.

# వచ్చే నాలుగు రోజులు వానలే వానలు.. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ !




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈశాన్య బంగాళాఖాతం వరకు కొనసాగుతున్న రుతుపవన ద్రోణి, నైరుతి ఉత్తరప్రదేశ్ ప్రాంతంలో ఉన్న వాయుగుండం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ కోస్తా, పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ వరకు ఏర్పడిన ఉపరితల చక్రవాత ఆవర్తనం, తూర్పు పశ్చిమ ద్రోణి ప్రభావంతో వానలు కురుస్తున్నాయి.

(జులై 18) హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్ నగర్, నారాయణ్ పేట్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతవరణ శాఖ హెచ్చరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. శనివారం (జులై 19) కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్,

రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శనివారం ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్స్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

# నష్టాల్లో సెన్సెక్స్-నిఫ్టీ.. అసలు కారణాలు ఇవే..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈవారం దేశీయ స్టాక్ మార్కెట్లు చివరి ట్రేడింగ్ రోజుల భారీగా నష్టాల్లోకి జారుకున్నాయి. గడచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో కూడా సూచీలు నష్టాలను చూస్తున్నాయి. అసలు మార్కెట్ల నష్టాలకు కారణం ఏంటి.. పెట్టుబడిదారులను కంగారు పెడుతున్న అంశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

వాస్తవానికి ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల పవనాలతో పాటు విదేశీ పెట్టుబడులు భారతీయ మార్కెట్ల నుంచి తరలిపోవటం వంటి అంశాలు మార్కెట్లను నష్టాల్లోకి నెట్టేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. మధ్యాహ్నం 2.57 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 520 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ కొనసాగిస్తుండగా, మరో కీలక సూచీ నిఫ్టీ 145 పాయింట్లు కోల్పోయింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీలు కూడా నష్టాల్లోనే తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. తాజాగా ప్రైవేటు బ్యాంకింగ్ సంస్థ యాక్సిస్ బ్యాంక్ విడుదల చేసిన నిరాశాజనకమైన ఫలితాలతో మార్కెట్లలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్లు దెబ్బతిన్నాయి. దీంతో యాక్సిస్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్బీఐ లైఫ్, హెచ్డీఎఫ్సీ లైఫ్ ఇన్సూరెన్స్, కోటక్ మహీంద్రా వంటి బ్యాంకింగ్ స్టాక్స్ కూడా నష్టాల్లోకి జారుకున్నాయి.

విదేశీ మదపరులు

చైనా సహా ఇతర మార్కెట్లలో ఆకర్షనీయమైన పెట్టుబడి అవకాశాలతో దేశీయ మార్కెట్లను వీడటం నష్టాలకో మరో కారణం అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వికె విజయకుమార్ చెప్పారు. మార్కెట్ల పతనానికి మరో కారణం పెరిగిన వోలటాలిటీ ఇండెక్స్ కూడా అని తేలింది. ప్రస్తుతం లిస్టెడ్ కార్పొరేట్ కంపెనీలు తన త్రైమాసిక ఫలితాలను ప్రకటిస్తున్న వేళ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఆశించిన స్థాయిలో కంపెనీల పనితీరు లేకపోవటంతో వేచి చూసే ధోరణిని ప్రస్తుతం వారు కొనసాగిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# మంచిర్యాల జిల్లాలో ఏసీబీ ట్రాప్.. రూ.30 వేలు లంచం తీసుకుంటూ బుక్కైన లేబర్ ఆఫీసర్




**హైదరాబాద్ పెన్ పవర్:**అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వరుస దాడులు చేస్తూ లంచగొండుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేస్తూ పట్టుకుంటున్నారు. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసినా కొందరి తీరు మారటం లేదు. లంచం డిమాండ్ చేస్తూ సామాన్యులను వేధిస్తూనే ఉన్నారు. దాడులు చేస్తున్నది మా ఆఫీస్ పైన కాదు కదా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం (జులై 18) మంచిర్యాల జిల్లాలో ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి లంచం తీసుకుంటున్న అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సహాయ కార్మిక అధికారి కార్యాలయం పై ఏసీబీ అధికారులు దాడి చేశారు. లంచం తీసుకుంటున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఓ మహిళ నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటుండగా బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుకన్యను పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. అంతకు ముందు గురువారం (జులై 17) రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మెరుపుదాడులు చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్, మెదక్ జిల్లా సదాశివపేట్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎస్ఆర్‌వో కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ మేరకు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. బీబీనగర్ ఎస్ఆర్‌వో కార్యాలయంలో తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.61,430 స్వాధీనం చేసుకోవడంతో పాటు కార్యాలయ ఆవరణలో 12 మంది అనధికారిక డాక్యుమెంట్ రైటర్లు, ప్రైవేటు వ్యక్తులను గుర్తించి 93 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జడ్చర్ల ఎస్ఆర్‌వోలో రూ.30,900 నగదు, 20 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని11 మంది అనధికారిక వ్యక్తులను గుర్తించినట్టు తెలిపారు. సదాశివపేట్ ఎస్ఆర్‌వోలో రూ.5,500 లెక్కల్లో చూపని డబ్బుతో పాటు 9 మంది ప్రైవేటు వ్యక్తులను గుర్తించారు. 39 రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అన్ని కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని పేర్కొన్నారు. అన్ని అకవతవకలపై తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆ మరుసటి రోజే మంచిర్యాల జిల్లాలో రూ.30 వేలు లంచం తీసుకుంటూ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పట్టుబడటం గమనార్హం.

# రెసిడెన్షియల్ ప్లాట్లకు హైదరాబాద్‌లో డిమాండ్.. 2022 నుంచి తగ్గని కొనుగోళ్ల జోరు..




**హైదరాబాద్ పెన్ పవర్:**దక్షిణ భారతదేశంలోనే కాకుండా దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వేగంగా విస్తరిస్తున్న వాటిలో హైదరాబాద్ ఒకటి. గడచిన కొన్నేళ్లుగా ప్రపంచ స్థాయి కంపెనీల రాక హైదరాబాద్ కి పెరగటంతో పెరుగుతున్న ఉపాధి, వృత్తి అవకాశాలు నగర విస్తరణను కోరుకుంటున్నాయి. రుణాల లభ్యత పెరగటంతో చాలా మంది ప్లాట్లు కొనేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తాజాగా రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ అందించిన డేటా ప్రకారం2022 నుంచి మే 2025 మధ్య కాలంలో భారీ సంఖ్యలో కొత్త రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ప్రారంభించబడిన నగరాలుగా హైదరాబాద్, ఇండోర్, బెంగళూరు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కరోనా తర్వాత ప్రజలు ఎక్కువగా ప్లాటెడ్ డెవలప్మెంట్ కేటగిరీ కొనుగోళ్లు పెంచారు. ఇది పెట్టుబడిదారులకు భవిష్యత్తులో విలువను పెంచటంతో పాటు డెవలపర్లు కూడా వేగంగా అమ్ముకాలతో క్యాష్ చేసుకుంటున్నారు. ఒకప్పుడు కొనుగోలుదారులు ఎక్కువగా అపార్ట్మెంట్ల వైపు మొగ్గుచూపారు. కానీ ఇప్పుడు అభివృద్ధి చేసిన ప్లాట్లను కొనడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. వేగంగా భూమి ధర పెరగటంతో పాటు అధిక రాబడులు రావటంతో వీటి డిమాండ్ పెరగటానికి ఒక కారణంగా ఉంది. మొదట్లో తక్కువగా పెట్టుబడి, వేగంగా విక్రయాలతో చేతికి డబ్బు చేరటం, కొనుగోలుదారులకు నచ్చినట్లు ఇల్లు కట్టుకునేందుకు వెసులుబాటు వంటి అంశాలు ఈ కేటగిరీ రియల్ ఎస్టేట్ డిమాండ్ పెంచుతోంది.

2022-25 మధ్య కాలంలో దేశంలోని టాప్-10.. టైర్-1, టైర్-2 నగరాల్లో కొత్తగా 4లక్షల 70వేల రెసిడెన్షియల్ ప్లాట్స్ ప్రాజెక్టులు వచ్చాయి. ప్రధానంగా పెద్ద నగరాల్లో మాత్రమే కాకుండా టౌన్లలో

కూడా ప్రజలు భూమిని కలిగి ఉండటం పెట్టుబడిగా భావిస్తున్న తరుణం, దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహంగా భూమిని భావించటం వల్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు వేగంగా నగరీకరణలో కీలక వనరైన భూమి లభ్యత పరిమితంగా ఉండటం ఇన్వెస్టర్లను ఎక్కువగా ఆకర్షించే కారణాల్లో ఒకటిగా ఉంది.

దేశంలోని పది టైర్-1 నగరాల్లో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లోనే 2లక్షల 25వేల ప్లాట్ల ప్రాజెక్టులు పుట్టాయి. ప్రజల నుంచి నిరంతరం పెరుగుతున్న డిమాండ్ ప్రాజెక్టుల లాంచ్ కి దోహదపడుతోందని రియల్టర్లు చెబుతున్నారు. ప్రధానంగా కోయంబత్తూర్, చెన్నై, సూరత్ నగరాలు ఎక్కువ ప్రాజెక్టుల లాంచ్ చూశాయి. 2022 నుంచి ఇప్పటి వరకు లాంచ్ అయిన ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ. 2లక్షల 44వేల కోట్ల వరకు ఉంటుందని ప్రాప్ ఈక్విటీ సంస్థ అంచనా వేసింది.

## హైదరాబాద్ లో రెండు గంటల నుంచి భారీ వర్షం..
# ఇబ్బందులపడుతున్న నగరవాసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురుస్తుంది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. అనేక చోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి ఏకధాటిగా భారీ వర్షం కురుస్తూనే ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, కంటోన్మెంట్, హకీంపేట్, మియాపూర్, కూకట్ పల్లి, ప్రగతినగర్, మూసాపేట్, అమీర్ పేట్, బేగంపేట్, నాంపల్లి, ఖైరతాబాద్, కోఠి, చాదర్ ఘాట్, మలక్పేట్, దిల్ సుఖ్ నగర్, సరూర్ నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం పడుతుంది.

**ట్రాఫిక్ ఇబ్బందులు...**

అబ్దుల్లాపేర్ మెట్, సికింద్రాబాద్, అల్వాల్, తిరుమలగిరి, బోయినపల్లి, మారేడ్ పల్లి, తార్నాక, ఓయూ క్యాంపస్, హబ్సిగూడ, ఉప్పల్, నాచారం, మల్లాపూర్, ఆర్టీసీ క్రాస్ రోడ్, అశోక్ నగర్, గాంధీనగర్, కవాడిగూడ, భోలక్ పూర్, చిక్కడపల్లి, హిమాయత్ నగర్ లలో వర్షం పడుతుంది. ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులన్నీ జలమయం కావడంతో వాహనాలు నీటిలో మొరాయించాయి. వాతావరణ శాఖ హైదరాబాద్ కు భారీ వర్షం పడుతుందని చేసిన హెచ్చరికలతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు.

**అవసరమైతే తప్ప...**

అనేక చోట్ల ట్రాఫిక్ గంటల పాటు నిలిచిపోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో మ్యాన్ హోళ్లు తెరుచుకోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈరోజు రాత్రి వరకూ భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో నగర వాసులు ఎవరూ బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. ఆఫీసు నుంచి ఇళ్లకు చేరే వారు కూడా మెట్రో రైళ్ల ద్వారానే చేరుకోవాలని సూచించారు. వర్షపు నీరు తగ్గిన తర్వాత మాత్రమే ఆఫీసు నుంచి బయటకు రావాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాజేంద్రనగర్, చేవేళ్లలో భారీ వర్షం. ఇబ్రహీంపట్నంలో ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# అచ్చెన్నకు మంత్రిపదవి ఊపిరిసలపనీయకుండా చేస్తుందా?




**హైదరాబాద్ పెన్ పవర్:**కింజారపు కుటుంబం అంటే సిక్కోలు జిల్లాలో తిరుగులేదు. ఇప్పుడు ఆ కుటుంబం నుంచి ఒకరు రాష్ట్రమంత్రిగా, మరొకరు కేంద్ర మంత్రిగా ఉన్నారు. కేంద్ర మంత్రిగా కింజారపు రామ్మోహన్ నాయుడు పౌరవిమానయాన శాఖను చేపట్టారు. యువకుడు కావడంతో ఆయనకు ఢిల్లీలో చంద్రబాబు కీలక బాధ్యతలను అప్పగించారు. అతి చిన్న వయసులో కేంద్ర మంత్రి అయిన రామ్మోహన్ నాయుడు మంచి పేరు సంపాదించుకున్నాడు. అయితే ఇటీవల అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదం ఘటనతో కొంత ఇబ్బంది పడినా ఆయన పనితీరు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు. రామ్మోహన్ నాయుడుకు తెలుగుదేశం పార్టీలోనూ మంచి ప్రయారిటీ లభిస్తుంది.

**వ్యవసాయశాఖ కావడంతో...**

అయితే ఇదే సమయంలో రామ్మోహన్ నాయుడు బాబాయి అచ్చెన్నాయుడు మాత్రం మంత్రిపదవిలో ఉన్నా ఆనందం మాత్రం లేదు. అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండటమే ఇందుకు కారణం. అందరు మంత్రులదీ ఒక ఎత్తు. అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ మరొక ఎత్తు. నిరంతరం ఏదో ఒక సమస్య అచ్చెన్నాయుడును శాఖాపరంగా వెంటాడుతూనే ఉంది. ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. క్షణం తీరిక లేకపోయినా ఏదో ఒక సమస్య మెడకు వచ్చి చుట్టుకుంటుంది. ఒక సమస్య నుంచి బయటపడ్డామని భావించే లోపు మరొక సమస్య వచ్చి పడుతుండటంతో అచ్చెన్నాయుడుకు ఊపిరిసలపకుండా చేస్తున్నాయనే చెప్పాలి.

**గిట్టుబాటు ధరలు లేక...**

సహజంగా హెూం మంత్రికి కొన్ని ఇబ్బందులుంటాయి. కానీ అదేమి విచిత్రమో కానీ ఈ ఏడాదికాలంలోనే వ్యవసాయ శాఖ మంత్రికి వచ్చినన్ని కష్టాలు ఏ శాఖకు రాలేదంటే అది అచ్చెన్న దురదృష్టమేనని సొంత పార్టీ నేతలే అంటున్నారు. వ్యవసాయ శాఖలో మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు పనితీరుపైన కూడా ఇవి ప్రభావం చూపే అవకాశముందంటున్నారు. పొగాకు, మిర్చి, మామిడి పంటలకు సరైన గిట్టుబాటు రాకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. దీంతో విపక్షనేత వైఎస్ జగన్ మూడు చోట్లకు మిర్చి రైతులను గుంటూరులోనూ, పొగాకు రైతులను పొదిలిలోనూ, మామిడి రైతులను చిత్తూరులోనూ పరామర్శించారు. దిగుబడి ఈ ఏడాది ఎక్కువ కావడంతో గిట్టుబాటు ధరలు లభించడం లేదని ప్రభుత్వం చెబుతోంది.

**ఖరీఫ్ ప్రారంభం కావడంతో...**

ఖరీఫ్ సాగు ప్రారంభమయిన నేపథ్యంలో రైతులు అన్ని పంటలను వేశారు. దీనికి తోడు నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించినా వానలు కూడా పడకపోవడంతో సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వేసిన పంటలు కూడా నీరు అందక ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. దీంతో పాటు యూరియా దొరక్క రైతులు రోడ్డెక్కుతున్నారు. యూరియా కొరత కారణంగా రైతులు రైతుసేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరొకవైపు అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు కూడా జమ కాకపోవడంతో మొత్తం మీద అచ్చెన్న శాఖ అస్తవ్యస్థంగా మారిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# భారత్ కా 'షేర్' ఏకే 203... ప్రత్యేకతలు తెలుసుకోవాల్సిందే!




**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్ ఎప్పటికప్పుడు తన ఆయుధశక్తిని అప్ డేట్ చేసుకుంటూనే ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రత్యక్షంగా పాక్ కు, పరోక్షంగా చైనాకు ఈ విషయంపై స్పష్టత వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో కలాష్నికోవ్ సిరీస్ లో అత్యాధునికమైన ఏకే-203 రైఫిళ్లు అనుకున్న సమయానికంటే ముందే భారత్ ఆర్మీకి అందనున్నాయని తెలుస్తోంది.

అవును... ఉత్తరప్రదేశ్ లోని అమేథీలో భారత్-రష్యా భాగస్వామ్యంతో ఏర్పాటైన ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐ.ఆర్.ఆర్.పీ.ఎల్).. 'షేర్' పేరుతో ఏకే-203 రైఫిళ్లను తయారుచేస్తోంది. నిమిషానికి 700 రౌండ్లు ఫైర్ చేయగల సామర్థ్యం ఈ రైఫిల్ సొంతం కాగా... 800 మీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇది అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలుగుతుంది.

వాస్తవానికి రూ.5,200 కోట్ల ఈ భారీ కాంట్రాక్టులో భాగంగా 2032 అక్టోబరు నాటికి సుమారు ఆరు లక్షల కంటే పైగా ఏకే 203 రైఫిళ్లను అందజేయాల్సి ఉంది. అయితే.. అనుకున్న సమయానికంటే 22 నెలల ముందు.. అంటే 2030 నాటికే వీటిని భద్రతా దళాలకు ఇచ్చేస్తామని ఐ.ఆర్.ఆర్.పీ.ఎల్. సీఈఓ - మేనేజింగ్ డైరెక్టర్ మేజర్ జనరల్ ఎస్.కె.శర్మ తాజాగా వెల్లడించారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లడుతూ... ఇప్పటివరకు సుమారు 48,000 రైఫిళ్లు పంపిణీ చేయబడ్డాయని.. రాబోయే రెండు, మూడు వారాల్లో మరో 7,000 రైఫిళ్లు అందజేయబడతాయని తెలిపారు. ఇదే క్రమంలో ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి మరో 15,000 రైఫిళ్లు అందజేయబడతాయని ఎస్.కె.శర్మ తెలిపారు.

కొన్ని దశాబ్దాలుగా సాయుధ దళాలు ప్రముఖంగా వినియోగించే (ఇండియన్ స్మాల్ ఆర్మ్స్ సిస్టమ్) ఇన్సాస్ రైఫిళ్ల స్థానంలో ఆర్మీ వీటి వినియోగం పెంచనుంది.

వీటి మ్యాగజైన్ లో ఒకేసారి ముప్పై కార్ట్రిడ్జ్ లను ఉంచవచ్చు. ఇన్సాస్ (4.15 కిలోలు) తో పోల్చుకుంటే ఏకే 203 రైఫిల్ బరువు తక్కువ (3.8 కిలోలు)గా ఉంటుంది. ఇన్సాస్ (960 మి.మీ) తో పోల్చుకుంటే ఈ షేర్ పొడవు (705 మి.మీ) కూడా తక్కువే!

## లోకేశ్ ను కలిస్తే తప్పేంటన్నకేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**మరో పదేళ్లు నేనే సీఎం. ఇదేనామాట. చంద్రశేఖర్ రావు డెయిరీలో కాదు.. గుండెల మీద రాసుకో. నీ కొడుకు గుండెల మీద రాయి అని రేవంత్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. 2034 వరకూ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వమయినా పదేళ్ల పాటు అధికారంలో ఉందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. 1995 నుంచి 2004 వరకూ చంద్రబాబు, 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ అదికారంలో ఉందని, అలాగే 2024 నుంచి 2023 వరకూ బీఆర్ఎస్ కు ప్రజలు పట్టం కట్టారని, అలాగే ఇప్పుడు కూడా కాంగ్రెస్ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని చెప్పారు.

**పదేళ్ల కాలంలో...**

కేసీఆర్ తన పదేళ్ల కాలంలో తెలంగాణకు అన్యాయం చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాలను ఏపీకి దోచి పెట్టారన్న రేవంత్ రెడ్డి ఏపీ వాళ్లు నీళ్లు తీసుకెళుతున్నా పట్టీపట్టన్నట్లు వ్యవహరించిన కేసీఆర్ తన గురించి మాట్లాడమేంటని ప్రశ్నించారు. దమ్ముంటే గోదావరి, కృష్ణా నదులపై తెలంగాణకు జరిగిన అన్యాయంపై చర్చ జరిపేందుకు అసెంబ్లీకి రావాలని కేసీఆర్ కు సవాల్ విసిరారు. ఈ పాలమూరు బిడ్డ మరో పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని, ఫామ్ హౌస్ లో కూర్చుని తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కుమిలి కుమిలి ఏడవాలన్నారు. పదేళ్లు అధికారం ఇస్తే నీ ఇంట్లో వాళ్లకు కొలువులు ఇచ్చుకున్నావుకానీ, నిరుద్యోగ యువతను పట్టించుకోలేదని విమర్శించారు.

**హామీలు అమలు చేస్తాం...**

తాము అధికారంలోకి వచ్చిన యువతకు ఉద్యోగాలు ఇవ్వడం కోసం వరసగా నోటిఫికేషన్లు ఇస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిపది నెలల కాకముందు నుంచే పదవి నుంచి దిగిపోవాలంటూ లేస్తున్న వారికి ఒకే సమాధానం చెబుతున్నానని, తనను అడ్డుకునే కొద్దీ ఇంకాపైకిలేస్తానే తప్ప కిందపడనని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. శాపనార్థాలు పెడితే పదవులు ఊడవన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు పాలించమని తమకు అధికారం ఇచ్చారని, ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఇచ్చిన హామీలలో చాలా వరకూ పూర్తి చేశామని, ఇంకా మిగిలిపోయిన వాటిని కూడా అమలు చేస్తామని తెలిపారు.

## కేంద్రం నుంచి రూ. 46,715 సాయం అంటూ సందేశం వచ్చిందా? అది సైబర్ నేరగాళ్ల పనే.. జాగ్రత్త!

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 46,715 సాయం పొందవచ్చని మీకు వాట్సాప్ సందేశం వచ్చిందా? అయితే జాగ్రత్త వహించండి! ఇటువంటి సందేశాలను సైబర్ నేరగాళ్లు పంపి మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే అవకాశం ఉంది. ఇలాంటి సందేశం వచ్చి, వారు పంపిన లింక్‌పై క్లిక్ చేసి మీ వ్యక్తిగత వివరాలను షేర్ చేస్తే మీ ఖాతాలోని సొమ్ము ఖాళీ అవుతుంది.

**ఖండించిన కేంద్ర ప్రభుత్వం**

ప్రజలు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటుండటంతో ఆ తీవ్రతను తగ్గించేందుకు ప్రతి పౌరుడికీ రూ. 46,715 సాయంగా ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించిందని, రిజిస్టర్ చేసుకోవాలంటూ వాట్సాప్‌లో ప్రచారం జరుగుతోందని, కానీ ఇందులో వాస్తవం లేదని కేంద్రం ఖండించింది.ఇది ఒక కుంభకోణమని, అలాంటి పథకాన్ని దేనినీ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఇలాంటి లింకులు వస్తే క్లిక్ చేయవద్దని, ఎవరికీ షేర్ చేయవద్దని హెచ్చరించింది. సైబర్ నేరగాళ్ల మాయలో పడవద్దని సూచించింది.

# ఫ్రూట్ జ్యూస్ ఎక్కువుగా తాగుతున్నారా.. కేన్సర్ రావచ్చు.. బీ అలర్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:**కొందరు రెగ్యులర్ గా కాకపోయినా... ఇంట్లో పండుగలప్పుడో.. వేడుకలప్పుడో.. చుట్టాలు, దోస్తులతో కలిసి కూల్? డ్రింక్స్ తాగుతారు. ఇంకొందరు మాత్రం ఆకలేసినా, దాహమేసినా, బోర్ కొట్టినా... మూడ్? ను బట్టి కూల్? డ్రింక్స్ తాగుతూనే ఉంటారు. అయితే అవి ఆరోగ్యానికి మంచిది కాదంటూ... కేన్సర్లు వస్తున్నాయంటూ స్టడీస్ చెప్తున్నాయి. ఒక్క కూల్? డ్రింకే కాదు... ఇంట్లో చేసిన మామిడి, ఆకు పచ్చ ద్రాక్ష, సపోటా వంటి పండ్ల రసాలైనా ఎక్కువగా తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ఓ స్టడీలో తేలింది. చక్కెర శాతం ఎక్కువగా ఉన్న ఫ్రూట్ జ్యూస్, టీ, కాఫీలు తాగినా ముప్పే.. ఒక మనిషి రోజుకు తీసుకోవాల్సిన దానికంటే... ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎక్కువ చక్కెర తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశాలు 18 శాతం పెరుగుతాయంటున్నారు పరిశోధకులు. పండ్ల రసాల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అవి రోగనిరోధకశక్తిని పెంచి, గుండె సమస్యలను అరికడతాయి. అందుకే మొత్తానికే తీసుకోవద్దని కాదు కానీ... ఏదైనా సరే తక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది.

**సర్వే ఎలా జరిగింది?**

మొత్తం లక్షమందిని సంప్రదించి 'ఫ్రెంచ్ న్యూట్రినెట్ శాంటీ' అనే వెబ్? సైట్ ఈ సర్వే చేసింది. అందులో 79శాతం మహిళలు, 21 శాతం మంది పురుషులు పాల్గొన్నారు.ఎవరెవరు రోజులో ఎంతశాతం చక్కెర తీసుకుంటున్నారో తెలుసుకుని అంచనా వేశారు.అంతేకాదు, వ్యాయామం, కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు, ధూమపానం, వయసు, చదువు మొదలైన వివరాలతో పాటు ఆహారపు అలవాట్లు కూడా తెలుసుకున్నారు.

అందులో షుగరీ డ్రింక్స్ ఎక్కువగా తాగే వాళ్లలో.... చాలామంది కేన్సర్ బారినపడ్డట్లు సర్వేలో వెల్లడైంది. ఇంకొంతమంది గుండె సంబంధిత వ్యాధులు, టైప్-2 డయాబెటిస్, ఒబెసిటీతో బాధ పడుతున్నట్లు తెలిసింది. వాళ్లందరిలో మొత్తం 2,193 కేన్సర్ కేసులు ఉన్నాయి. 693 మంది బ్రెస్ట్ కేన్సర్, 291 మంది ప్రొస్టేట్ కేన్సర్, 166 మంది కొలరెక్టల్ కేన్సర్? తో బాధపడుతున్నట్లు ఆ సర్వే చెప్తోంది. వీళ్లందరికీ షుగరీ డ్రింక్స్.... అంటే అధిక చక్కెర కలిగిన జ్యూస్లు, డ్రింక్స్ తీసుకునే అలవాటు ఉందని తేలింది.

**భయపడాల్సిన పని లేదు..**

ఈ సర్వేలో వెల్లడైన వివరాలన్నీ నిజమే అయినా.... షుగరీ డ్రింక్స్ తాగే వాళ్లందరికీ కేన్సర్ వస్తుందని కాదు. రోజులో తీసుకునే చక్కెర మోతాదును తగ్గించుకుంటూ...కొన్నాళ్లకు ఆ అలవాటును పూర్తిగా మానేస్తే ఆరోగ్యానికి మంచిది. టీ, కాఫీల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. రోజుకు ఒకటి. రెండుసార్లే తాగుతూ.. అందులో చక్కెరను తక్కువ వేసుకోవాలి. అలాగే ఏ పండులో తక్కువ చక్కెరశాతం ఉంటుందో తెలుసుకొని.. దాని జ్యూస్ తాగాలి. బయట దొరికే సోడా, కార్బొనేటెడ్ డ్రింక్స్, మద్యానికి దూరంగా ఉండాలి. కేవలం షుగరీ డ్రింక్స్ తాగడం వల్లే కేన్సర్ వస్తుందని ఎక్కడా నిర్ధారణ కాలేదు.

**చక్కెరతో ఒబెసిటీ..!**

పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరైనా చక్కెరను మోతాదుకు మించి తీసుకుంటే ఒబెసిటీ వస్తుందంటున్నారు నిపుణులు. తాజా పండ్లు, కూరగాయల్లోనూ చక్కెర ఉంటుంది. వాటిని నేరుగా తీసుకోకుండా... పండ్ల రసాల్లో అదనంగా చక్కెర కలిపి తీసుకోవడమే

ఆరోగ్యానికి హాని చేస్తుంది. ఉదాహరణకు... తాజా పండ్ల గుజ్జులో చక్కెర కలపడం, మార్కెట్లో దొరికే కార్బొనేటెడ్ డ్రింక్స్ తాగడం ఈ మధ్య అందరికీ అలవాటైంది. అయితే ఏది తీసుకున్నా లిమిట్? లో ఉండాలి. లేదంటే అది అధిక బరువు (ఒబెసిటీ)కి దారి తీస్తుంది. దానివల్ల ఇతర ఆరోగ్య సమస్యలు రావొచ్చని ఓ స్టడీ ద్వారా తెలుస్తోంది..

# క్రికెట్ లో కిరికిరి.. ఈ మ్యాచ్ ఫిక్సింగ్ ఏంట్రా మావా?




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ భ్రష్టుపట్టి పోయింది. అవినీతితో తడిసిపోయింది. ఐపీఎల్ మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పెద్దలు బెదిరించడంతో అసలు విషయం బయటపడింది. కక్కుర్తి పడి టిక్కెట్లు ఇవ్వాలంటూ సన్ రైజర్స్ యాజమాన్యాన్నిబెదిరించడంతో తాము హైదరాబాద్ నుంచి తప్పుకుంటామని సన్ రైజర్స్ హెచ్చరించడంతో ప్రభుత్వం అప్రమత్తమయి వెంటనే రంగంలోకి దిగి దీనిపై విజిలెన్స్ విచారణతో పాటు సీఐడీ విచారణకు ఆదేశించింది. ఇటీవల సీఐడీ అధికారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో అవినీతికి పాల్పడిన ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారిని కస్టడీలోకి తీసుకుని విచారించారు కూడా.

**క్రికెట్ తో సంబంధం లేని...**

అసలు క్రికెట్ తో ఏమాత్రం సంబంధంలేని, బ్యాట్, బంతి కూడా చూడని వాళ్లు క్రికెట్ అసోసియేషన్ కు పెద్దలుగా మారుతున్నారు. కేవలం రాజకీయ పలుకుబడితోనే వారు పదవులు పొందుతున్నారు. కోట్లలో లాభం. ఎందుకంటే గత కొన్నేళ్ల నుంచి ఏ రాజకీయ పార్టీ మారినా, రాష్ట్రం ఏదైనా క్రికెట్ అసోసియేషన్ కు రాజకీయ నాయకులో.. వారి అనుచరులో ప్రెసిడెంట్ లుగా ఎన్నికవు తూ వస్తున్నారు. వారు క్రికెట్ విషయంలో ఓనమాలు తెలియకపోయినా కోట్లు సంపా దించి తమకు కొంత కమీషన్లు తెచ్చి ఇవ్వడ మో.. పార్టీకి ఫండ్ ఇవ్వడమో చేస్తారని వారిని ఎంపిక చేస్తారు. తాజాగా ఈ కేసులో పోలీసు అధికారులు కూడా భాగస్వామ్యుల య్యారంటే క్రికెట్ అసోసియేషన్ ఎంత చెత్తగా తయారయిందో అర్థం చేసుకోవచ్చు.

**కీలక నేతకు సమీప బంధువు...**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఒక పార్టీలో కీలకమైన నేతకు సమీప బంధువు. అదే సమయంలో కార్యదర్శి దేవరాజ్ పరారీలో ఉన్నాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కోట్ల రూపాయలను సంపాదించిందన్న ఆరోపణలున్నాయి. రంజీ ట్రోఫీ నుంచి క్రీడాకారుల ఎంపికలోనూ వీరు చేతివాటం ప్రదర్శిస్తున్నారని విచారణలో తేలింది. అసలు క్రికెట్ అసోసియేషన్ వల్ల ఎవరు నిజంగా ఆటలో పైకి వచ్చారు. సిరాజ్ ఆటో డ్రైవర్ కొడుకు అయినా కష్టపడి పైకి వచ్చి టీం ఇండియాలో చోటుదక్కించుకున్నారు. తిలక్ వర్మ కూడా సాధారణ కుటుంబం నుంచి వచ్చినవారే. వారి కోచ్ లు వేరు. వారు కష్టపడిన తీరు వేరు. కసి, కృషి పట్టుదలతోనే వారు అంత స్థితికిచేరుకున్నారు.

**నిబంధనలను మారిస్తేనే...?**

నితీష్ కుమార్ రెడ్డి కూడా అంతే. ఇలాంటి సమయంలో క్రికెట్ అసోసియేషన్ తో సంబంధం లేకుండా స్వయంకృషితో ఎదిగిన వాళ్లను స్ఫూర్తిగాతీసుకోవాలని కోరుతున్నారు. అదే సమయంలో క్రికెట్ అసోసియేషన్ లో మాజీ క్రికెటర్లకు చోటు కల్పిస్తే కొంత వరకూ ఫలితం ఉంటుందన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. అప్పటి వరకూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కి చెందిన అనుబంధ సంస్థగా క్రికెట్ అసోసియేషన్ మారక తప్పదు. క్రీడాకారుల తలరాతలు మాత్రం మారవు. అందుకే ఇప్పటికైనా క్రికెట్ అసోసియేషన్ పదవికి అర్హతలు నిర్ధారించాలన్న డిమాండ్ గట్టిగా వినపడుతుంది. మరి ఇప్పటికైనా ప్రభుత్వా లు ఆ దిశగా నిర్ణయం తీసుకుంటేనే గ్రామీణ స్థాయిలో ఉన్న అసలైన ఆణిముత్యాలు వెలు గు చూస్తాయి. లేకుంటే హైదరాబాద్ నుంచి మరో క్రికెటర్ అంతర్జాతీయ స్థాయి ఆటగాడుగా మారడం కష్టమే.